క్లుప్తంగా

పీఏసీఎస్ సీఈఓకు అవార్డు



అవార్డు అందుకుంటున్న సీఈఓ

నగరి: నాబార్డ్ 44వ వార్షికోత్సవం పురస్కరించుకుని నగరి పీఏసీఎస్ సీఈఓ తులసిపిళ్లై నాబార్డ్ అవార్డు అందుకున్నారు. విజయవాడ నాబార్డ్ ప్రాంతీయ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో సహకార శాఖ కమిషనర్ బాబు చేతుల మీదుగా ఆయన అవార్డు స్వీకరించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార రంగంలో బ్యాంకును అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నందుకుగాను ఆయనను అవార్డు వరించింది.

గోవింద భక్తులకు అన్నదానం



అన్నం వడ్డిస్తున్న సిబ్బంది

నగరి : స్థానిక ఓంశక్తి ఆలయంలో సోమవారం పాదయాత్ర గోవింద భక్తులకు అన్నదానం చేశారు. తమిళనాడు దిండివనం నుంచి తిరుమలకు కాలినడకన వెళ్తున్న భక్తులకు ఆలయం వద్ద ఎల్‌కేఆర్ జ్యువెలరీ అధినేత రామ్‌కుమార్ అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రోన్లతో పటిష్ట నిఘా



డ్రోన్ కెమెరాను ఎగురవేస్తున్న పోలీసులు

కార్వేటినగరం: మందుబాబుల ఆట కట్టించేందుకు డ్రోన్ కెమెరాలు ఎంతో ఉపకరిస్తాయని సీఐ హనుమంతప్ప అన్నారు. సోమవారం తన కార్యాలయ ఆవరణలో ప్రయోగాత్మకంగా డ్రోన్ కెమెరాలను ఎగురవేసి, వాటి పనితీరు గురించి సీఐ మాట్లాడారు. మద్యం సేవించి ఆగడాలు చేస్తున్న వారిని ఈ కెమెరాలతో గుర్తించవచ్చని, అలాగే అటవీ ప్రాంతాల్లో అక్రమ సారా తయారీ స్థావరాలను సులభంగా గుర్తించి వీటికి అడ్డుకట్ట వేయవచ్చన్నారు. నేరాల నియంత్రణలో ఇవి ఇక ప్రధాన పాత్ర పోషించనున్నట్లు చెప్పారు. సీసీ కెమెరాలు ఎంత అవసరమో అలాగే డ్రోన్లు కూడా పటిష్ట నిఘాకు దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో మోహన్, రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

కోరిన సమాచారం ఇవ్వాల్సిందే



వెదురుకుప్పం: మాట్లాడుతున్న ఎంపీడీఓ పురుషోత్తం

వెదురుకుప్పం: సమాచార హక్కుచట్టం కింద పౌరులు కోరిన సమాచారాన్ని పొందే హక్కు ఉందని ఎంపీడీఓ పురుషోత్తం అన్నారు. సోమవారం వెదురుకుప్పంలో అధికారులకు ఆర్టీఐపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడారు. ప్రతి కార్యాలయంలోనూ ప్రజలకు తాము అడిగిన సమాచారాన్ని అందుబాటులో ఉంచాలన్నారు. సమాచారం ఇవ్వడంలో ఎవరూ అలసత్వం వహించకూడదన్నారు. కార్యక్రమంలో ఏఓ నాగమణి, ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీఓ కోదండరెడ్డి, ఏఓ వనిత, ఏపీఎం పరశురామిరెడ్డి, ఏపీఓ మీనా కుమారి, ఏఈలు మధుసూదన్‌రెడ్డి, గాయత్రి, హౌసింగ్ ఏఈ పృథ్వీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శకుంతల, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన



పాలసముద్రం: సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పిస్తున్న పంచాయతీ కార్యదర్శి శంకర్

పాలసముద్రం: సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఎంపీడీఓ సతీష్ కోరారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓతోపాటు పంచాయతీ కార్యదర్శి శంకర్ మాట్లాడారు. సమాచార హక్కు చట్టం, అందులోని సెక్షన్లు.. మొదలైన వాటి గురించి వివరించారు. సమాచార హక్కు చట్టం ఆధారంగా ఎవరు కోరినా సమాధానం చెప్పాల్సిందేనన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ గిరిజ, ఐకేపీ ఏపీఎం కల్పలతారెడ్డి, మండల విస్తరణాధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కక్ష సాధింపుతోనే అక్రమ అరెస్టులు



వెదురుకుప్పం: నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

వెదురుకుప్పం: రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి అరెస్టును ఖండిస్తూ సోమవారం వెదురుకుప్పంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. పార్టీ మండల కన్వీనర్ పద్మనాభరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పేట ధనంజయరెడ్డి, నియోజకవర్గ నాయకుడు భీమశంకర్‌రెడ్డి, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు సుబ్రమణ్యం, వైద్య విభాగం గంగాధరనెల్లూరు నియోజకవర్గ అధ్యక్షుడు కోలార్ ప్రకాష్ తదితరులు మాట్లాడారు. లిక్కర్ వ్యవహారంలో ఎలాంటి సంబంధం లేకున్నా మిథున్‌రెడ్డిని అరెస్టు చేయడం సరికాదని మండిపడ్డారు. కేవలం కక్ష సాధింపుతోనే అక్రమంగా కేసులు పెట్టి జైలు పాలు చేస్తున్నారని మండిపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు గ్రామాల్లో సారా నిర్మూలనకు కృషి చేసిన అప్పటి ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామికి ఇప్పుడు సిట్ అధికారులు నోటీసు ఇవ్వడంలో మతలబు ఏమిటని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలే గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మాధవరావు, కార్యనిర్వాహక జిల్లా కార్యదర్శి రామయ్య, బూత్ కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివాజీ, పంచాయతీ వింగ్ కార్యదర్శి గోవిందయ్య, మండల ఉపాధ్యక్షులు చిరంజీవిరెడ్డి, గోవిందన్, రైతు విభాగం అధ్యక్షుడు ధనంజయరెడ్డి, మాజీ ఎంపీటీసీ గురవారెడ్డి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు లోకనాథరెడ్డి, యువత విభాగం మాజీ అధ్యక్షుడు నరేష్‌రెడ్డి, మాజీ సర్పంచులు హేమశేఖర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, నాయకులు పరంధామరెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, మునికృష్ణారెడ్డి, వాసు, వెంకటేష్, గజదీశ్‌రెడ్డి తదితరులతోపాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు

పాలసముద్రం: సూపర్ సిక్స్‌తోపాటు పలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు వాటిని నెరవేర్చకుండా ప్రజలను వంచిస్తున్నారని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ తులసి యాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్ విమర్శించారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఎంపీ మిథున్ రెడ్డి అరెస్టు అప్రజాస్వామికమని ఖండించారు. చంద్రబాబు ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబాన్ని లక్ష్యంగా ఇలా చేస్తున్నారని విమర్శించారు. అభివృద్ధి, సంక్షేమాన్ని గాలికొదిలేసి ప్రజలు దృష్టిని మరలించడానికి వైఎస్సార్ సీపీ కీలక నేతలపై అక్రమ కేసులు నమోదుచేసి జైలుకు పంపుతున్నారని విమర్శించారు. దీనికి సీఎంతోపాటు మంత్రి లోకేష్ కూడా మూల్యం చెల్లించకతప్పదన్నారు. కార్యక్రమంలో పోలయ్య, బాబు, తిరుమల, చిన్నపయ్యన్, లక్ష్మణన్, రవిరెడ్డి, పయణి, సత్యరాజ్, చిన్నప్పరాజు, ఆర్ముగం తదితర నాయకులు పాల్గొన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు అప్రజాస్వామికం

కార్వేటినగరం: మంత్రి నారా లోకేష్ స్వీయ విరచిత 'రెడ్ బుక్' పేరిట వైఎస్సార్‌సీపీ నాయకులను, కార్యకర్తలను వేధిస్తే భవిష్యత్తులో కూటమి నాయకులు తీవ్రపరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ శేఖర్‌రాజు హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ లోకసభాపక్షనేత, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టును నిరసిస్తూ సోమవారం కార్వేటినగరంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. మిథున్‌రెడ్డి అరెస్ట్ అప్రజాస్వామికమని, కక్ష పూర్తితంగా చేశారని విమర్శించారు. జిల్లాలో పెద్దిరెడ్డి కుటుంబానికి ఉన్న ప్రజా బలాన్ని ఎదుర్కోలేక, ఉద్దేశపూర్వకంగా అక్రమ కేసులు బనాయిస్తూ, తమ పార్టీ నాయకులను వేధిస్తున్న కూటమి ప్రభుత్వం రాబోవు రోజుల్లో దీనికి రెండింతలు మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ధనజయవర్మ, జిల్లా రైతు విభాగం కార్యదర్శి చందురాజు, వైస్ ఎంపీపీ కార్తీక్‌రెడ్డి, ధనశేఖర్ యాదవ్, దొరబాబు, శివప్రకాష్ మొదలియార్, తౌఫీర్‌ఖాన్, మున్నా, మునికృష్ణ, నందగోపాల్, శ్రీనివాసులురెడ్డి, రత్నంరెడ్డి, రాజా ,చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇది 'రెడ్‌బుక్' అరాచకం

గంగాధరనెల్లూరు: రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి అక్రమ అరెస్టు అప్రజాస్వామికమని వైఎస్సార్ సీపీ నాయకులు ఖండించారు. సోమవారం స్థానికంగా ఆ పార్టీ మండల కన్వీనర్, నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. లిక్కర్ కేసు బనాయించి మిథున్‌రెడ్డిని జైలుకు పంపించడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోందన్నారు. 'రెడ్ బుక్' అరాచకానికి ఇది నిదర్శనమని మండిపడ్డారు. కార్యక్రమంలో గ్రీనింగ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గుణశేఖర్ రెడ్డి, సీనియర్ నాయకులు, సర్పంచ్ ముని రాజారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ చిన్నమరెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఏకాంబరం, నేతలు వేల్కూరు కుట్టి , రూపకుమార్ రెడ్డి, వెంకటేష్‌రెడ్డి, లక్ష్మీకర రెడ్డి, రఘుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పాలసముద్రం: మాట్లాడుతున్న తులసి యాదవ్, అన్బలగన్



జీడీ నెల్లూరు: సమావేశంలో మాట్లాడుతున్న మండల నాయకులు



కార్వేటినగరం: మిథున్‌రెడ్డి అరెస్టును ఖండిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాజకీయంగా కనుమరుగు చేసే కుట్రలు



నారాయణరెడ్డి

వెదురుకుప్పం: రాజకీయంగా కనుమరుగు చేయాలన్న కుట్రలో భాగంగానే ఎంపీ మిథున్‌రెడ్డిపై అక్రమ కేసు బనాయించి అరెస్ట్ చేశారని గంగాధరనెల్లూరు నియోజకవర్గ బూత్ కమిటీ కన్వీనర్ బోడిరెడ్డి నారాయణరెడ్డి విమర్శించారు. ఎంపీ అరెస్ట్‌ను ఖండిస్తూ సోమవారం ఆయన మాట్లాడారు. జరగని స్కామ్‌లను ఆపాదించి కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ నాయకులపై కక్షపూరితంగా వ్యవహరిస్తోందని, మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామిపై సైతం వేధింపులకు పాల్పడుతోందని, దీనికి మూల్యం చెల్లించకతప్పదన్నారు.

కుట్రతోనే లిక్కర్ స్కాం కేసులు

పెనుమూరు(కార్వేటినగరం): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కుట్రతోనే లిక్కర్ స్కాం కేసులు బనాయిస్తోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త మహాసముద్రం దయాసాగర్‌రెడ్డి విమర్శించారు. సోమవారం ఆయన స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్, ఇతర హామీలను నెరవేర్చకపోవడంపై ప్రభుత్వాన్ని నిలదీస్తుండడంతో ప్రజల దృష్టి మరల్చేందుకు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబాన్ని టార్గెట్ చేసుకుని ఎంపీ మిథున్‌రెడ్డిపై అక్రమ కేసులు పెట్టిందన్నారు. ఎలాంటి ఆధారాలు లేని లిక్కర్ కేసు నిలవదని, కూటమి ప్రభుత్వాన్ని ప్రజలే తరిమి కొట్టే రోజులొస్తాయన్నారు.

ఐక్యతతో ఉంటే అభివృద్ధి

నగరి : ఐక్యతతో ఉంటే అగముడయార్ కులస్తులు అభివృద్ధి పథంలో పయనించవచ్చని మొదలియార్ సంఘ నిర్వాహకులు సాయి బాలాజి అన్నారు. సోమవారం స్థానిక ఈశ్వరగుడి సమీపం గోపాల్‌రెడ్డి మీటింగ్ హాలులో అగముడయార్ కులస్తుల సంఘ సమావేశం నిర్వహించారు. ఆగస్టు 13న చిత్తూరు రిలయన్స్ మార్టు ఎదురుగా గంగినేని లేక్ వద్ద నిర్వహించే మామన్నర్ మరుదు పాండియర్ కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమంలో కులస్తులు అందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక మొదలియార్ కులస్తులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల వినతులపై దృష్టి పెట్టండి

శ్రీరంగరాజపురం: ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అందిన వినతులపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని తహసీల్దార్ లోకనాథపిళ్లై ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. వివిధ సమస్యలపై 12 వినతులు వచ్చాయి. వీటిలో మ్యుటేషన్ 4, శ్మశానానికి దారి 1, భూ సర్వే 2, ఇంటి నిర్మాణానికి పొజిషన్ పట్టా మంజూరు చేయాలని 2, పట్టాదారు పాసు పుస్తకం మంజూరు చేయాలని 2, ఇతరుల ఆక్రమణలో భూమిని తొలగించి హద్దులను చూపించాలని 1 చొప్పున వినతులు అందినట్లు తహసీల్దార్ తెలిపారు. రెవెన్యూ సమస్యలు, ధ్రువ పత్రాల మంజూరు జాప్యం లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు.

ఆలయ భూములను పరిరక్షించండి

- సదాశివేశ్వరస్వామి ఆలయం వద్ద ప్రజా సంఘాల ధర్నా



మాట్లాడుతున్న ప్రజా సంఘాల నేతలు

పుత్తూరు: పట్టణంలోని శ్రీకామాక్షి సమేత శ్రీసదాశివేశ్వరస్వామి ఆలయ భూములను అధికారులు పరిరక్షించాలని స్థానిక సమాచార హక్కుల వేదిక కార్యదర్శి కె.మురగారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆలయం వద్ద సమాచార హక్కుల వేదిక, ఎంఆర్‌పీఎస్, అంబేడ్కర్ ప్రజా సంఘాల నాయకులు ధర్నా చేశారు. మురగారెడ్డి మాట్లాడుతూ, ఆలయ భూములను పరిరక్షించాల్సిన ఆలయ కార్యనిర్వహణాధికారి రాజకీయ నాయకులతో చేతులు కలిపి ఆలయానికి నష్టం చేస్తున్నారని ఆరోపించారు. సదాశివేశ్వరస్వామి ఆలయానికి చెందిన స్థలంలో అన్నా క్యాంటీన్ నిర్మించారని, దీనిని తాము వ్యతిరేకించడం లేదని, అయితే క్యాంటీన్ నిర్వాహకుల నుంచి ఎందుకు బాడుగ వసూలు చేయడం లేదని ప్రశ్నించారు. ఆలయం చుట్టూ దశాబ్దాలుగా నివసిస్తున్న పేదల ఇళ్లను తొలగించిన అధికారులు ఆ స్థలాన్ని వినియోగంలోకి ఎందుకు తీసుకురావడం లేదని, అలాగే ఆలయ కోనేరు చుట్టూ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారని, దీనిపై హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఆలయ స్థలంలో చిన్న చిన్న పూల అంగళ్లను తొలగించిన అధికారులు బ్యాంకు ఏటీఎంలకు ఎలా అనుమతిస్తారన్నారు. పేదలైన పూల వ్యాపారులు డ్రైనేజీలపై బతుకీడుస్తున్నారని, వారికి ప్రత్యామ్నాయం కల్పించాలని డిమాండ్ చేశారు. వారం లోపు సమస్యలను పరిష్కరించకపోతే వచ్చే సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు హేమలత, సుభద్రమ్మ, సురేష్‌బాబు, కిరణ్‌కుమార్, యోగేష్, అన్నుకుమార్, మునివేలు, వినోద్, మధు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం మూల్యం చెల్లించక తప్పదు



మిథున్‌రెడ్డి అరెస్టును ఖండిస్తూ మాట్లాడుతున్న పెనుమూరు వైఎస్సార్‌సీపీ నాయకులు

పెనుమూరు(కార్వేటినగరం): రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని కక్ష కట్టి అరెస్ట్ చేసిన కూటమి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించక తప్పదని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి యశోదారెడ్డి హెచ్చరించారు. మిథున్‌రెడ్డి అరెస్టును నిరసిస్తూ మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి ఆమె ఖండించారు. ఆమె మాట్లాడుతూ, పెద్దిరెడ్డి కుటుంబాన్ని రాజకీయంగా ఎదుర్కోలేక ఆ కుటుంబంపై అక్రమ కేసులు బనాయించిన సీఎం చంద్రబాబుకు కూడా రానున్న రోజుల్లో ఇదే పరిస్థితి తప్పదన్నారు. దమ్ముంటే రాజకీయంగా ఎదుర్కోవాలేగానీ రాజ్యాంగ వ్యవస్థల్ని భ్రష్టు పట్టిస్తూ ఇలా వేధించడంలో ఔచిత్యమేమిటని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను గాలికొదిలేసిన చంద్రబాబు తీరుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, అందుకే ఆయన డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి, ఏఎంజీ మాజీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, జగన్నాధరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు దూదిమోహన్, నరసింగారెడ్డి, లోకేష్‌రెడ్డి, హరికృష్ణ, దాము, యతీశ్వర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఫేస్ యాప్ వద్దని అంగన్‌వాడీల నిరసన



ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

కార్వేటినగరం: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఫేస్ యాప్ రికగ్నిషన్‌ను రద్దు చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు విజయ, మమత డిమాండ్ చేశారు. సోమవారం కార్వేటినగరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ సిబ్బంది కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ, పేద గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు పోషకాహారం, విద్యనందించాలన్నదే ఐసీడీఎస్ ముఖ్య లక్ష్యమన్నారు. అయితే ఇప్పుడు కొత్తగా పెట్టిన పోషణ ట్రాకర్ యాప్, బాల సంజీవని యాప్‌లపై అవగాహన లేక వర్కర్లు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఓటీపీ, ఈకేవైసీతో ఫొటో క్యాప్చర్ చేస్తేనే సరుకులు ఇవ్వాలనే పెట్టిన నిబంధనలు తొలగించాలన్నారు. అలాగే కేంద్రాలకు రావలసిన సరుకులు ఒకేసారి రావడం లేదని పడుతున్న ఇక్కట్లను ఏకరువు పెట్టారు. ఇలాంటి యాప్‌లను రద్దు చేయాలని, పనిఒత్తిడి లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం సూపర్‌వైజర్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో విజయ, నాగమ్మ, జీవ, సుధ, రాణి, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, వర్కర్లు పాల్గొన్నారు.

మామిడి ఫ్యాక్టరీ నిర్లక్ష్యం



ఫ్యాక్టరీ నుంచి వెలువడుతున్న వ్యర్థపు నీటిని ట్రాక్టర్‌తో విడుదల చేస్తున్న దృశ్యం



మామిడి ముట్టెలు కుళ్లిపోయి ఈగలు వాలుతున్న దృశ్యం

- వ్యర్థ జలాలతో సమస్యలు
- రోగాల బారిన పడుతున్న ప్రజలు

శ్రీరంగరాజపురం : మండలంలోని మామిడి ప్రైవేటు ఫ్యాక్టరీ నిర్లక్ష్యానికి సమీప గ్రామ ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. వివరాలు.. మండలంలోని మెదవాడ పంచాయతీ జంగాలపల్లె వద్ద వెబ్ నేచర్ ప్రైవేట్ లిమిటెడ్ మామిడి ఫ్యాక్టరీ ఉంది. ఈ ఫ్యాక్టరీ నుంచి వెలువడే వ్యర్థ జలాలు, మామిడి ముట్టెలను మెదవాడ దళితవాడ సమీపంలో పారపోస్తున్నారు. దీంతో ఈ వ్యర్థపు నీరు భూమిలోకి ఇంకి తాగునీరు కలుషితమవుతోంది. అలాగే ఈ నీరు నిల్వ వల్ల దుర్వాసన చిమ్ముతోంది. అలాగే దోమలు, ఈగల మోత పెరిగింది. మెదవాడ, జంగాలపల్లె, పిళ్లారికుప్పం, చిన్నతయ్యూరు,పెద్దతయ్యూరు, ఎస్టీ కాలనీ, ఎగువ మెదవాడ గ్రామాల ప్రజలు దీని వల్ల వివిధ సమస్యలు ఎదుర్కొంటున్నట్టు చెప్పారు. ఇప్పటికే చాలా మంది అనారోగ్యం బారిన పడి ఆస్పత్రుల పాలయ్యారని, ఈ సమస్యలపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు అధికారులు ఏ చర్యలూ తీసుకోవాలని మండిపడుతున్నారు. ఇకనైనా మామిడి ఫ్యాక్టరీ వ్యర్థ జలాలు, టెంకల సమస్య, దోమలు, ఈగల బెడద లేకుండా చేయాలని కోరుతున్నారు.

షియాల రక్త తర్పణం.. పీర్ల ఊరేగింపు



రక్తతర్పణం చేస్తున్న షియా ముస్లింలు



బాలగంగనపల్లెలో ఊరేగింపుగా తీసుకువస్తున్న పీర్లు

గంగాధరనెల్లూరు: ముస్లిం మత పెద్దల త్యాగాలకు ప్రతీకగా మండలంలోని బాలగంగానపల్లెలో సోమవారం షియా ముస్లింలు రక్త తర్పణం, పీర్ల ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మత పెద్దలు మౌలానా అమర్ హైదర్ (అంజుమన్ సజ్జాదియా హుస్సేన్ కమిటీ, బెంగళూరు) ప్రత్యేక ప్రార్థనలతో ముతవల్లి అలీ షేర్ ఖాన్ ఆధ్వర్యంలో బాలగంగానపల్లె మొహర్రం 25వ దినం నిర్వహించారు. హజరత్ ఇమామ్ హుస్సేన్ కుమారుడు హజ్రత్ సజ్జాదియా కుటుంబీకుల త్యాగాలకు ప్రతీకగా పీర్లను ప్రత్యేకంగా అలంకరించి, భక్తి గీతాలతో యువకులు రక్తం చిందిస్తూ ఊరేగింపు నిర్వహించారు. తమిళనాడు, కర్ణాటక తెలంగాణ రాష్ట్రాల నుంచి వందలాది మంది షియా ముస్లింలు పాల్గొన్నారు. దాదాపు 5000 మందికి అన్నదానం చేశారు.